క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మల్లికార్జునగర్‌లోని క్రీడా మైదానంలో వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ పోటీలను ప్రారంభించారు. సర్పంచ్ చిత్తూరి హారిక, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, మండల నాయకులు గుమ్మా యల్లేష్, ఉపాధ్యాయులు కిరణ్ కిశోర్ కుమార్, కరుణాకర్, నిర్వాహకులు మొగల్ న్యామత్‌బేగ్, షరీఫ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

పాఠశాల నుంచి పారిపోయిన విద్యార్థినులు

- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మార్కాపురం: మార్కాపురం శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థినులు ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు వారం క్రితం సాయంత్రం పూట ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లారు. రాత్రి సమయంలో ఇద్దరు విద్యార్థినులు పాఠశాలలో లేని విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తమ సిబ్బందితో తెల్లవార్లూ వెతికి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు గుర్తించి పాఠశాల సిబ్బందికి అప్పగించారు. మార్కాపురం మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన ఆ విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారమిచ్చి ఇంటికి పంపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సునీతను వివరణ కోరగా.. ఇద్దరు విద్యార్థినులు బయటకు వెళ్లిన మాట వాస్తవమేనని, ప్రస్తుతానికి ఆ ఇద్దరిని తల్లిదండ్రుల వద్దకు పంపినట్లు తెలిపారు.

శాస్త్రీయ సమాజమే జేవీవీ లక్ష్యం

గిద్దలూరు రూరల్: శాస్త్రీయ సమాజమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం అని జేవీవీ రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక గిద్దలూరు డివిజన్ 17వ మహాసభ పట్టణంలోని రాజుపారామెడికల్ ఒకేషనరల్ కాలేజీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో తర్కించే తత్వాన్ని, పరిశీలించే గుణాన్ని, ఆలోచించే శక్తిని పెంపొందించేందుకు జేవీవీ ప్రయత్నిస్తుందన్నారు. జనవిజ్ఞాన వేదిక.. సమాజంలోని మూఢ నమ్మకాలను రూపుమాపేందుకు ప్రయత్నిస్తుందన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానం పట్ల అవగాహన సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఏపీటీసీఏ మాజీ అధ్యక్షుడు కె.రామిరెడ్డి, జేవీవీ నాయకులు డా.జి.కె.మోహన్‌రెడ్డి, డా. భూమా నరసింహారెడ్డి, డి.జి.బ్రహ్మానందరెడ్డి, కొండేటి రాజ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

13న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

మార్కాపురం: రజక విద్యా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన ఒంగోలులోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో 10వ తరగతిలో 450కి పైగా మార్కులు సాధించిన రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని సంఘ నాయకులు దేవలూటి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక నగదు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు 80966 46072 వాట్సప్ నంబరుకు వివరాలు పంపాలని సూచించారు.

ప్రజల వద్దకే పాలన

- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకవచ్చి ఎంతో మేలు చేసిందని దర్శి ఎమ్మెల్యే డాక్టర్‌మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పెద్దవరంలో ఆదివారం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యకేంద్రం నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి అందులో ప్రభుత్వ అధికారులుండి ప్రజలకు ఏ అవసరమొచ్చిన తమ గ్రామాల్లోనే పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ఆయనదేనన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లక్షల మందికి తమ ఇళ్ల వద్దనే వారికి అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా ఇచ్చినట్లు చెప్పారు. గ్రామాలకు ప్రభుత్వ కార్యాలయాలు కిరీటాల్లా ఉన్నాయని, ఆహ్లాదకరమైన వాతావరణంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యకేంద్రం, పాల కేంద్రం, డిజిటల్ లైబ్రరీ వంటి కార్యాలయాలు అన్ని ఒకే చోట నిర్మించడం శుభపరిణామమన్నారు. రైతు భరోసా కేంద్రాలతో విస్తృత ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఇలాంటి ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దవరం, బయ్యవరం, కల్లూరు సర్పంచ్‌లు మారెళ్ల నరసమ్మ, మాలెపాటి నాగేశ్వరరావు, నక్కా రామకృష్ణ, కురిచేడు ఎంపీటీసీ బుల్లం వెంకటనర్సయ్య, ఏఎంసీ డైరెక్టర్ కాశయ్య, వైఎస్సార్ సీపీ మండల ప్రచార కమిటీ కార్యదర్శి కండె గంగయ్య, నాయకులు బెల్లం చంద్రశేఖర్ ,వరికూటి వెంకటేశ్వర్లు, మారెళ్ల రామాంజి, చెన్నంశెట్టి గురవయ్య, తెల్లమేకల వెంకటేశ్వర్లు, అడుసుమల్లి పెద్ద సాంబయ్య, పెద్దయ్య, గొట్టిపాటి బొల్లికొండయ్య, సారెడ్డి నాగిరెడ్డి, రోడ్డా వెంకటరెడ్డి, యర్రగుంట్ల రోశయ్య, వేమా శ్రీను, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాద్, వ్యవసాయాధికారి పి. మధు, వైద్యాధికారి పి. ప్రవీణ్ పాల్గొన్నారు.



సచివాలయం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

నూతన వధూవరులకు ఆశీర్వచనం

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా సోదరుని కుమార్తె వివాహానికి దర్శి శాసన సభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ఆదివారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన జీవితం ఆనందంగా గడవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, సానికొమ్ము తిరుపతి రెడ్డి, మండల సచివాలయాల కన్వీనరు మేరువ సుబ్బారెడ్డి, నాయకులు బెల్లం చంద్రశేఖర్, కండె గంగయ్య, వైవీ సుబ్బయ్య, కర్నాటి చిన్న వెంకటరెడ్డి, సాదం నాసరయ్య, ఎంపీటీసీ కానాల శివారెడ్డి, కొత్త వెంకట అయ్యపుశెట్టి పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

చంద్రబాబును అరెస్టు చేయాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం: చిత్తూరు జిల్లా పుంగనూరులో హింసాత్మక సంఘటనలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే కారణమని, తక్షణమే ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓడిపోయి ఉనికి కోల్పోవడంతో చంద్రబాబు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉండటం చంద్రబాబుకు ఇష్టం లేదని, ఉనికిని కాపాడుకునేందుకే తరచూ దాడులకు ఉసిగొల్పుతున్నారన్నారు. తనను గెలిపించలేదన్న బాధతో ఇటీవల కాలంలో పోలీసులను దుర్భాషలాడుతూ పిచ్చిపట్టినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. పుంగనూరు సంఘటనలో ఆయన దగ్గరుండి పోలీసులపై దాడికి ఉసిగొల్పడం దారుణమన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉండి ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని బాబు.. ప్రస్తుతం చెబుతున్న మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిన మంచిపేరును చంద్రబాబు జీర్ణించుకోలేక దాడులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఒక వైపు చంద్రబాబు, మరో వైపు లోకేష్, ఇంకో వైపు పవన్‌కల్యాణ్ యాత్రలు చేస్తున్నా ప్రజల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో కుట్రలకు తెరలేపారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రజలను రెచ్చగొట్టి మత కలహాలు సృష్టించేందుకూ చంద్రబాబు వెనకాడరన్నారు. ప్రజల మనసుల్లో నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానాన్ని తొలగించలేరన్న విషయాన్ని చంద్రబాబుతోపాటు టీడీపీ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు.

జనవిజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం ఎంపిక

కంభం: మండల జనవిజ్ఞాన వేదిక నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవ అధ్యక్షునిగా బైసానిరామ క్రిష్ణ, అధ్యక్షుడిగా నారపురెడ్డి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వరికుంట్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా దేవిరెడ్డి నాగేంద్రుడు, పార్ధ సారధి, సహాయ కార్యదర్శిగా రంగస్వామి, కోశాధికారిగా షేక్ మస్తాన్, హెల్త్ కన్వీనర్లుగా డా. సద్దాం హుస్సేన్, తిరుమల నాథ్, చెకుముకి టాలెంట్ టెస్ట్ కన్వీనర్లుగా నాయబ్ రసూల్, ఖాసిం, యూత్ కన్వీనరుగా జావీద్, సాంస్కృతిక కమిటీ కన్వీనరుగా రమాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు పి. స్వరూపరెడ్డి పాల్గొన్నారు.



కార్యవర్గ సభ్యులు

ప్రజాస్వామ్యానికి మచ్చ చంద్రబాబు



ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద మచ్చ తెస్తున్న చంద్రబాబునాయుడును ప్రజలు క్షమించరని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబునాయుడు హింసా కాండలను సృష్టిస్తున్నాడన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ప్రాజెక్టుల సందర్శన పేరుతో ప్రతిపక్షనేత చంద్రబాబు తన ఉనికిని తెలుపుకునేందుకు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. జెడ్ కేటరిగీ హోదాలో ఉన్న ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుకు ముందుగా పోలీసు వారు కేటాయించిన రూట్‌కు వెళ్లకుండా తన ఇష్టమొచ్చిన రీతిలో రూటు మ్యాపు మార్చు చేసుకుని శాంతిభద్రతలకు హాని కలిగించేలా కారణమయ్యారన్నారు. రెచ్చగొట్టే మాటలతో మారణహోమం సృష్టించారన్నారు. పోలీసులపై రాళ్లదాడి చేయించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. పుంగనూరులో జరిగిన అల్లర్లకు చంద్రబాబును ఏ 1 ముద్దాయిగా చేర్చి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తన ఉనికి చాటుకునేందుకు ఇటువంటి కుతంత్ర రాజకీయాలకు తెరలేపుతున్న చంద్రబాబుకు ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారన్నారు.

నాగార్పమ్మ గుడికి రూ. 50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే వేణుగోపాల్

దర్శి: తాళ్ళూరు మండలంలోని నాగార్పమ్మ గుడికి దర్శి శాసనసభ్యుడు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ రూ. 50 వేల విరాళం అందజేశారు. దేవాలయం నిర్వాహకులు ఆదివారం దర్శి లోని ఎమ్మెల్యే వేణుగోపాల్ ని కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరడంతో అందించినట్లు చెప్పారు.

మాజీ సర్పంచ్‌కు ఆర్థిక సాయం

దర్శి: మండలంలోని చలివేంద్ర మాజీ సర్పంచ్ బూసిరాజు ఏడుకొండలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఏడుకొండలును ఆదివారం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పరామర్శించారు. ఆయనకు రూ. 25000 ఆర్థిక సాయం చేసి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

త్రిపురాంతకం: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సోమవారం మండలంలోని కేశినేనిపల్లిలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్. పోలిరెడ్డి తెలిపారు. త్రిపురాంతకం మండలంలోని కేశినేనిపల్లిలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ నేతలు పాల్గొనాలని కోరారు.

గుంటూరు వెళ్లి పింఛను అందజేత



ఎలీషాకు పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్



పింఛను అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న విజయలక్ష్మి అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా వలంటీర్ జి.జ్యోతి అక్కడికి వెళ్లి పింఛను అందించారు. వలంటీర్‌ను విజయలక్ష్మి కుటుంబ సభ్యులు అభినందించారు.

వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు సచివాలయం పరిధిలో చింతలపూడి గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు దాసరి ఎలీషా ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ కోసం ఎదురు చూస్తుండగా వలంటీర్ విజయమ్మ ఆదివారం ఒంగోలు హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ నగదును అందజేసింది. దీంతో ఎలీషా వలంటీర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అన్ని కులాలూ సమానమే!

త్రిపురాంతకం: సమాజంలోని అన్నికులాల సమాహారమే హిందూ ధర్మమని ఏకులం ఎక్కువ, ఏకులం తక్కువన్నది కాదన్న సత్యం ప్రతి ఒక్కరూ గుర్తించాలని సమరసత సద్భావన నెల్లూరు ప్రకాశం రీజియన్ కన్వీనర్ సావర్కర్ పేర్కొన్నారు. త్రిపురాంతకంలో ఆదివారం జరిగిన సద్భావన సదస్సులో ఆయన మాట్లాడారు. వృత్తుల ఆధారంగా ఆచరిస్తున్న వారిని కులంగా భావిస్తూ వచ్చారన్నారు. సమాజంలో ప్రతి కులం చాలా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. పురాతనంగా సమాజంలోని మునులు, రుషులు, అంతా బ్రాహ్మణ అగ్రవర్ణాలకు చెందిన వారే కాదని పలు సామాజిక వర్గాలకు చెందిన మహోన్నతమైన మేధావులే రుషి మునులుగా వర్ధిల్లారన్నారు. కుల సంఘాల పెద్దలు బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందని సావర్కర్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని సామాజిక వర్గాలు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కులాల వారీగా విడిపోతే సాధించేదేమీ లేదని చెప్పారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖులు

పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలో 1983–85 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మ ఆశ్రమం, మానసిక వికలాంగుల పాఠశాలలోని చిన్నారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పీఆర్ కాలనీలోని సంజీవని వృద్ధాశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలోని వితాసుబ్బరత్న కల్యాణ మండపం ఆవరణలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. రూ.50 వేల నగదును తోటి విద్యార్థి మచ్చా సింధూకు మెడిసిన్ చదువు కోసం విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేయించారు. తులసిబాబు, దప్పిలి రంగారెడ్డి, హనుమంతారెడ్డి పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

అలరించిన చిన్నారుల నృత్యం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో ఆదివారం కోర్టు ప్రాంగణంలో భవనాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరైన హైకోర్టు న్యాయమూర్తులను స్వాగతిస్తూ పట్టణంలోని స్నేహ నాట్య అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. చిన్నారులతోపాటు ప్రిన్సిపాల్ ప్రతిమను హైకోర్టు జడ్జిలు మన్మధరావు, జి.రామకృష్ణ ప్రసాద్, ఏవీ రవీంద్రబాబు, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ భీమానాయక్, ఎస్సైలు ప్రత్యేకంగా అభినందించారు.




చిన్నారులను అభినందిస్తున్న సీఐ భీమానాయక్

పంచాయతీ వార్డు ఎన్నికలకు నోటిఫికేషన్

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం పంచాయతీ పరిధిలోని 2వ వార్డుకు ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ వసంతరావు నాయక్ ఆదివారం తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నామినేషన్లు దాఖలు చేయాలి, 11వ తేదీ స్క్రూటినీ, 12వ తేదీ అభ్యంతరాలు తెలుపుకోవటం, 13వ తేదీ నామినేషన్లు ఉపసంహరణ, 14వ తేదీ సాయంత్రం 3 గంటలకు పోటీదారుల జాబితా ప్రకటన, 19వ తేదీ మధ్యాహ్నం వరకు ఎన్నికల నిర్వహణ, సాయంత్రం లెక్కింపు, విజయం పొందిన అభ్యర్థి ప్రకటన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

సాయి భక్తితత్వాన్ని చాటాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి హరిహరరావు

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్లలో సాయిబాబా మందిరంలో జిల్లా స్థాయి సాయి మందిరాల సమాఖ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి హరహరరావు మాట్లాడుతూ సాయిబాబా భక్తి తత్వాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడం, అలాగే కొన్ని ప్రత్యేక పండగలప్పుడు నిరుపేదలకు దుప్పట్లు, రాత పుస్తకాలు పంపిణీ చేయడం, మొక్కలను నాటడం లాంటి సేవ కార్యక్రమాలు చేయాలన్నారు. సమావేశానికి జిల్లాలో 30 సాయిబాబా మందిరాల నుంచి 170 మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం సీహెచ్ రజనీకుమార్ రాసిన సాయిబాబా చాలీసా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, సహాయ కార్యదర్శులు వసంతరావు, సుబ్బారావు, రమణారెడ్డి, వెంకటరమణ, నరసింహారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడులు

తాళ్లూరు (ముండ్లమూరు): సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు తెలిపారు. మండలంలోని శివరామపురంలో ఆదివారం రైతులకు సేంద్రియ ఎరువు వాడకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్ని రకాల రసాయన ఎరువులు వేసినా సేంద్రియ ఎరువుతో సాటి రావన్నారు. సేంద్రియ ఎరువు అధిక దిగుబడికి కల్పతరువులని తెలిపారు. ఎకరానికి ఐదు ట్రాక్టర్ల సేంద్రియ ఎరువు వాడితే సరి పోతుందన్నారు.

జీవామృతంతో దిగుబడులు



జీవామృతం తయారీ విధానం నేర్పుతున్న మూర్తయ్య

దర్శి: జీవామృతం పిచికారీతో కందిపంటను బెట్ట నుంచి కాపాడవచ్చని ప్రకృతి వ్యవసాయ కార్యకర్త మూర్తయ్య తెలిపారు. ఆదివారం చందలూరు యూనిట్ పరిధిలోని మారెడ్డిపల్లిలో రైతులకు జీవామృతం తయారీ విధానాన్ని నేర్పించారు. పిచికారీ చేస్తే త్వరగా వాడిపోకుండా పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వేణుగోపాల్, రమణమ్మ, నారాయణ, సర్పంచ్ జడలపెద్దన్న, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కోటా సత్యమాంబదేవి పూజలు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



తాళ్లూరు (ముండ్లమూరు): ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు



మార్కాపురం టౌన్: ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీధర్ రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

అంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని విఠలాపురంలో మారం వారి కులదైవం అంకమ్మతల్లి మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మతల్లికి పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీ ఏఎంసీ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మారం వెంకారెడ్డి, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మారం కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మారం వెంకారెడ్డి